క్లుప్తంగా

ఆర్డీఓకు వినతి

ప్రొద్దుటూరు : డాడీ హోం ఆస్తులను ప్రభుత్వ ఆధీనంలో కాపాడుతూ, పూజ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా ఉండాలని ప్రొద్దుటూరుకు వచ్చిన ఆర్డీఓ శ్రీనివాసులుకు గురువారం పీడీఎస్ఓ రాయలసీమ కన్వీనర్ కత్తి ఓబులేసు వినతి పత్రం ఇచ్చారు. పాఠశాల మెయింటెనెన్స్ అవకతవకలు లేకుండా చూడాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్లు

ప్రొద్దుటూరు : పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా పరిశీలించారు. సుందరాచార్యుల వీధిలో చేపడుతున్న రోడ్డు విస్తరణ, కాలువ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. అలాగే శివాలయం సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జూదరులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బుడ్డాయపల్లెలో పేకాట ఆడుతున్న ముగ్గురిని గురువారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4520 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రొద్దుటూరు : స్థానిక 13వ వార్డులోని శ్రీనివాసనగర్ సున్నంబట్టి వీధి ఆరవేటి థియేటర్ ప్రాంతాల్లో పెరిగిన కంపను, వ్యర్థాలను గురువారం కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా మున్సిపల్ అధికారుల సహాయంతో తొలగించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి కంప పెరిగిపోవడంతో పందులు, పాములు, విష పురుగులతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు తెలపడంతో చర్యలు చేపట్టామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టికి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్, స్టార్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగు ప్రతిభా పోటీలు



తెలుగు ప్రతిబా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మైదుకూరు : తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మైదుకూరు మండల వనరుల కేంద్రంలో విద్యార్థులకు మండల స్థాయిలో తెలుగు ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పద్మలత మాట్లాడుతూ బుధవారం మండలంలో పాఠశాల స్థాయిలో ఈ పోటీలు జరిగాయని, వారిలో ఎంపిక చేసిన వారికి గురువారం మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి పోటీల్లో విజేతలైన ఇద్దరు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక వుతారన్నారు. ఈ నెల 26న డివిజన్ స్థాయి పోటీలు మైదుకూరు మండల వనరుల కేంద్రంలో జరుగుతాయని తెలిపారు. ప్రతిభా పోటీలను పోటీల ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోండి

మైదుకూరు : రైతులు నారుమడి వేసేందుకు మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలని కడప రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారులు పద్మజ, శైలజ పేర్కొన్నారు. మైదుకూరులోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం మైదుకూరు, లింగాలదిన్నె రైతులకు వ్యవసాయ విత్తనోత్పత్తి పథకం కింద ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన శుద్ధి, మొలక శాతం, నాణ్యత, విత్తన ఎంపిక తదితర విషయాల్లో రైతులు శ్రద్ధ పెట్టాలన్నారు. నారుమడిలో యాజమాన్యం గురించి, నాట్లు వేయడం గురించి వారు రైతులకు శిక్షణ ఇచ్చారు. నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు ఒక కిలో వంతున నారుమడిలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో మైదుకూరు మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

శివపురంలో పొలంబడి

మండలంలోని శివపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారులు రైతులకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ గురించి వివరించారు. గ్రూప్ డైనమిక్స్, పొలంబడి తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా నిలిచాం

- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున సుంకేసుల, సుంకేసుల దళితవాడలు, యానాదికాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాలను వివరిస్తున్నప్పుడు లబ్ధిదారుల నుంచి అపూర్వ స్పందన రావడం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వార ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు అలాగే వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. సకాలంలో నీరు అందించడంతో పాటు పంట నష్ట పరిహారం ఇస్తున్న పార్టీ తమదేనని తెలియజేశారు. గతంలో పరిహారం ఎప్పుడు వచ్చేదో ఎవరికీ అర్థమయ్యేది కాదన్నారు. పంటకు గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నదని గుర్తు చేశారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు సుంకేసుల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, సర్పంచ్ యన్నం రాణెమ్మ, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఉపమండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ మరిళీమోహన్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులరెడ్డి, చెన్నకేశవరెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, ములపాక బుజ్జి, ఎంపీటీసీలు కనపర్తి సుబ్బారెడ్డి, బండి శ్రీనివాసులుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి సహకరించండి

మైదుకూరు : మైదుకూరుకు మంజూరైన పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కోరారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యజమానులతో ఆయన గురువారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ భవనంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడం శుభపరిణామమన్నారు. కళాశాలలో ఆరు బ్రాంచులు ఉండటం ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టమన్నారు. కళాశాల భవనాల కోసం కేంద్రం రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో స్థానిక సాయినాథపురం ప్రాథమిక పాఠశాల భవనాల్లో కళాశాల నిర్వహించినా, వచ్చే విద్యా సంవత్సరానికి సొంత భవనాలలో తరగతులు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రచారం కోసం శనివారం మైదుకూరు పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రత్యేక విధుల అధికారి, ప్రిన్సిపాల్ గురుమూర్తి రెడ్డి, ఎంఈఓ పద్మలత, ప్రభుత్వ హైస్కూళ్ల హెడ్ మాస్టర్లు, ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

రద్దయిన పనుల స్థానంలో కొత్త పనులు



సమావేశంలో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ అధికారులు

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.130 కోట్ల నిధులలో కొన్ని సాంకేతిక కారణాల వలన రద్దు అయిన వివిధ రకాల పనుల స్థానంలో కొత్త పనులు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవోకాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులతో 17 ప్యాకేజీలుగా విభజించి చేపట్టిన పనుల్లో కొన్ని పనులు సాంకేతిక కారణాలతో రద్దు చేయడం జరిగిందని, వాటి స్థానంలో సీమాంక్ ఆసుపత్రి సమీపంలో గల 7 ఎకరాల స్థలంలో కూరగాయల మార్కెట్, చేపలమార్కెట్ ఏర్పాటు, 23 సచివాలయాల పరిధిలో శ్మశానాల అభివృద్ధి, ఎన్జీవో కాలనీ, కోటవీధిలలో పార్కుల ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పనులకు ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానవాటిక స్థలాలకు హద్దులు కేటాయించాలని కోరారు. అలాగే వీధివీధి పాలకు త్రీఫేస్ లైన్ సౌకర్యం త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులను కోరారు.

చంద్రయాన్–3 విజయవంతంపై హర్షం

ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడంపై పాలకవర్గం ఇస్రో శాస్త్రవేత్తలను, టెక్నికల్ సిబ్బందిని సమావేశంలో అభినందించారు. మున్సిపల్ చైర్మన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు చప్పట్లు కొట్టి అభినందనలు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్ రెడ్డి, ఏఈలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీ వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు పూర్తి

పోరుమామిళ్ల : మండలంలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం (నేడు) శ్రీ వరలక్ష్మీదేవి వ్రతం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ యా ఆలయాల కమిటీలు పేర్కొన్నాయి. కరపత్రాల ద్వారా భక్తులకు కార్యక్రమాన్ని తెలిపారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం శ్రీ వరలక్ష్మీ వ్రతం భారీగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తులసి సురేష్, జనార్ధనశెట్టి తెలిపారు. అలాగే శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలోని మహాలక్ష్మీదేవి సన్నిధిలో ఉదయం అమ్మవారికి అభిషేకం, అనంతరం వరలక్ష్మీవ్రతం ప్రారంభమవుతుందన్నారు. వ్రత అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, మహిళలు పూజాద్రవ్యములతో రావాలని ఆలయ అధ్యక్షులు పెసల నరసింహులు తెలిపారు. కాలువకట్ట తిరుమలగిరి గోదాదేవి, లక్ష్మీదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ లక్ష్మీ అమ్మవారికి విశేష కుంకుమార్చన, భక్తులచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయని ధర్మకర్త తిరిపేలయ్య, అధ్యక్షులు చాటకొండు సత్యనారాయణ తెలిపారు.

ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కవిత, తిరుపేలయ్య, మహమ్మద్‌యాసిన్‌లు విద్యారంగానికి అందించిన సేవలు ప్రశంసనీయమని మండల విద్యాశాఖాధికారి నిర్మల పేర్కొన్నారు. గురువారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, వాకా చంద్రశేఖర్, మహేష్‌కుమార్, విజయలక్ష్మి, పరిమళజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కేతవరంలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేతవరం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9:30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక తెలుగుగంగకాలనీలోని వెంకయ్యస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుండే స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, గణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పురవీధుల గుండా వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సముద్రాలదత్తాత్రేయ, విశ్వేశ్వరరావు, ఆలయ అర్చకులు , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈనెల 27న ఉదయం 9.30 గంటలకు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహమర్ బాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి తెలిపారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు 60 మీటర్లు పరుగు పోటీలు, కిడ్స్ జావెలిన్‌త్రో, 16 ఏళ్లలోపువారికి 100, 300, 800 మీటర్ల పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, 18 ఏళ్లలోపువారికి 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, 20 ఏళ్లలోపు స్త్రీ, పురుషులకు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్‌త్రో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 8019880995కు సంప్రదించాలన్నారు.

చంద్రయాన్–3 విజయం గర్వకారణం



అట్లూరులో మానవహారంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఖాదర్‌వల్లి



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



వరికుంట్లలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అట్లూరు : చంద్రయాన్–3 విజయం ప్రతి భారతీయునికి గర్వకారణమని ఎంఈఓ ఖాదర్‌వల్లి తెలిపారు. ఇస్రో ఆధ్వర్యంలో విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుని దక్షిణధృవంపై విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భంగా మండలంలోని అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు.

అనంతరం విద్యార్థులు జాతీయ పతాకాలు చేతపట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామ కూడలిలో మానవహారంగా ఏర్పడి గ్రామస్తులకు చంద్రయాన్–3 విజయవంతంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల కృషిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని రాణించాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రయాన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

పోరుమామిళ్ల : ఇస్రో శాస్త్రవేత్తల అహర్నిశల శ్రమకు గుర్తింపుగా బుధవారం సాయంత్రం చంద్రునిపై చంద్రయాన్–3 విజయవంతంగా ల్యాండ్ కావడంపై గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, సీనియర్ అధ్యాపకులు శ్రీధరమూర్తి సులోచన మాట్లాడుతూ విద్యార్థులు చంద్రయాన్–3ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు రవిచంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు. విద్యార్థులు, కళాశాల సిబ్బంది జాతీయ జండాలు ప్రదర్శిస్తూ ఆనందోత్సవ సంబరాలు చేసుకున్నారు.

చంద్రయాన్ విజయవంతంపై ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ –3 ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలను అభినందిస్తూ వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్ విద్యార్థినులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం పాఠశాలలోని విద్యార్థినులు 70 అడుగుల జాతీయ పతాకంతో పాఠశాల నుంచి రాజీవ్ సర్కిల్, పుట్టపర్తి సర్కిల్ మీదుగా పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాదరెడ్డి మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధృవంపై రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన మొదటి దేశంగా భారత దేశం చరిత్ర సృష్టించిందన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించే స్థాయికి భారత్

కాశినాయన : ప్రపంచం గర్వించే స్థాయికి భారత్ చేరిందని వరికుంట్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోజిరావు తెలిపారు. చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా చంద్రుని దక్షిణ ధృవంపై రోవర్ విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భంగా మండలంలోని వరికుంట్ల గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు గురులక్ష్మి, బాలరాజు, చంద్రశేఖర్, వసుంధరాదేవి, చెన్నయ్య, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లె పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం కొత్తపల్లె పంచాయతీలోని మీనాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొత్తపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు వివేకానంద నగర్, ప్రకాష్ నగర్, జేమ్స్ కొట్టాల, మీనాపురం, సుందరయ్యనగర్ కాలనీల్లో సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందే పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధి ఎక్కువ కావడంతో రూ.50 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అందులో భాగంగా బుధవారం మత్స్య కాలనీలో రూ.35 లక్షలతో రోడ్డు, కాలువ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించామన్నారు. మీనాపురం గ్రామంలో గురువారం రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు, కాలువ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ పేరం సునీత, మాజీ సర్పంచ్ గురుస్వామి, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంభం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు



జోగిరెడ్డిగారిపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ గడపకు వెళ్లినా...ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని వీరపల్లి పంచాయతీలోని జోగిరెడ్డిగారిపల్లె, ఎల్లుగారిపల్లె, రామస్వామిపల్లె గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని.. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బిజివేముల రమణమ్మ, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల కన్వీనర్లు రామసుబ్బారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దపోలురెడ్డి, సర్పంచ్ జయసుబ్బారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మండల నాయకులు బీరంసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సూర్యహాస్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందచేశారు. పోరుమామిళ్ల మండలం బొప్పాపురంకు చెందిన కడుగు రామయ్యకు రూ. 2 లక్షలు, కాశినాయన మండలం బాలాయపల్లెకు చెందిన పాలగుల్ల దుగ్గమ్మకు రూ. 5 లక్షలు, మిద్దెల గ్రామానికి చెందిన యర్రబల్లె ఎల్లయ్యకు రూ. లక్ష రూపాయల చెక్కులు వారి కుటుంబసభ్యులకు అందచేశారు.కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మెన్ కల్లూరు రమణారెడ్డి, కాశినాయన మండల కన్వీనర్ హనుమంతారెడ్డి, మిద్దెల సర్పంచ్ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలి



ఓపీ విభాగంలో వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ హిమదేవి

ప్రొద్దుటూరు క్రైం : రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డీసీహెచ్ఎస్ వై హిమదేవి అన్నారు. జిల్లా ఆస్పత్రిని గురువారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. రిపోర్టు సాధ్యమైనంత త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఓపీ విభాగాలను సందర్శించారు. అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి త్వరగా రోగులు కోలుకునేలా వైద్యం చేయాలని వైద్యులకు సూచించారు. గైనకాలజీ, ఆర్థో, పిజియోథెరపీ, అత్యవసర విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రితో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డీసీహెచ్ఎస్ వెంట మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ, హెడ్ నర్సులు ఉన్నారు.

పల్లవోలు చెరువును కబ్జా నుంచి కాపాడండి




పల్లవోలు చెరువు స్థలంలో అక్రమంగా వేసిన ప్లాట్లు

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె, పల్లవోలు జంట చెరువులను కబ్జా నుంచి కాపాడాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొలెరో బాషా జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులును కోరారు. మండలంలోని రైతాంగం దాదాపు చెరువులపైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నాసీర్ అనే వ్యక్తి పల్లవోలు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 394లో 228 ఎకరాల్లో పల్లవోలు చెరువు ఉండగా, చెరువు ఉన్న సర్వే నెంబర్లను మార్చి అక్రమంగా ప్లాట్లు వేసి వాటిని విక్రయిస్తున్నారని గురువారం ఆర్డీఓకు తెలియజేశారు. పల్లవోలు చెరువు ఆక్రమణకు గురి కాకుండా కాపాడి, అక్రమ ప్లాట్ల నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు.

సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం: ఆర్డీఓ

పల్లవోలు చెరువులో జరుగుతున్న ప్లాట్ల నిర్మాణంపై సర్వే చేయించి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. సిబ్బందిని కేటాయించుకుని మూడు రోజులు చెరువు విస్తీర్ణం గుర్తించి సర్వే చేసి నివేదిక అందించాలని మండల సర్వేయర్ సాయిలతకు ఆదేశించారు.


నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : మనబడి నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని, ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడి పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ–పంట నమోదు పక్కాగా అమలు జరగాలన్నారు. ఆర్బీకే కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పథకంలో అందరికి పనులు కల్పించాలన్నారు.

నకిలీ పట్టాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సుధాకర్ మాదిగ

ప్రొద్దుటూరు కల్చరల్ : అమృతానగర్‌లో ఇళ్ల స్థలాల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్న టీడీపీ మాజీ కౌన్సిలర్ శ్రీరామ ఓబులేసు, గద్దం నరసింహులు, కాంతయ్యలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల సర్వే నంబర్లతో పట్టాలు సృష్టించి దొంగ సీల్ వేసి, తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పట్టాలను విక్రయిస్తున్నారని, వారి ద్వారా ఇళ్ల పట్టాలు కొని అమాయక ప్రజలు మోసపోతున్నారన్నారు. భూ కబ్జాదారులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. బాధితురాలు బీబీసార మాట్లాడుతూ రూ.4.50లక్షలతో రెండు ప్లాట్లను కొన్నామని ఇళ్లు కట్టుకోవడానికి వెళితే స్థలం యజమానులు తమను అడ్డుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బాధితులు వరలక్ష్మి, గౌసియా పాల్గొన్నారు.